ఓపెన్ జిమ్.. పర్యవేక్షణ నిల్!

మరమ్మతులకు నోచుకోని జిమ్ పరికరాలు

- సామాన్లు విరిగిపోయి నిరుపయోగంగా మారిన వైనం
- పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు



మోతీనగర్: ఉరుకుల పరుగుల జీవితంలో వ్యాయామం చేయక వివిధ రోగాల భారీన పడుతున్నారు. గత ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని మూసాపేట, అల్లాపూర్ డివిజన్‌లలోని ప్రాంతాల్లో ప్రజల సౌకర్యార్థం ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేసింది. అల్లాపూర్ డివిజన్‌లోని గాయత్రినగర్ జీహెచ్‌ఎంసీ పార్కు ఆవరణలో, అదే విధంగా మూసాపేట డివిజన్‌లోని పాండురంగ నగర్ పార్కు ఆవరణలో ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేశారు. దీంతో స్థానిక ప్రజలు నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో ఓపెన్ జిమ్‌కు వచ్చి వ్యాయామం చేస్తున్నారు.

- కానీ జిమ్ పరికరాలు మూణ్నాళ్లకే విరిగిపోయి ఎందుకు పనికిరాకుండా పోయాయి. ఓపెన్‌జిమ్‌లను పర్యవేక్షించాల్సిన వారిని నియమించకపోవంతో ఓపెన్ జిమ్‌లోని పరికరాలు కూడా నిరుపయోగంగా మారాయి. కనీసం నెలకు ఒక్కసారైనా పర్యవేక్షించాల్సిన అధికారులు ప్రారంభించిన నాటి నుంచి నేటి వరకు కూడా ఇటు వైపు చూసిన పాపాన పోలేదని స్థానికులు వాపోతున్నారు. పలు మార్లు స్థానికులు మొరపెట్టుకున్నా ఫలితం లేదు. ఇప్పటికైనా ఓపెన్‌జిమ్ ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో ట్రైనర్లను ఏర్పాటు చేసి పరికరాలకు మరమ్మతులు చేయిస్తే అవి ప్రజలకు ఎంతగానో ఉపయోగపడతాయని స్థానికులు పేర్కొంటున్నారు.



- ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో మహిళలు, యువకులు క్రమం తప్పకుండా వ్యాయామం చేయటానికి ఎక్కువ మక్కువ చూపుతున్నారు. అటువంటి వారికి జిమ్ పరికరాలు విరిగిపోయి ఉపయోగకరంగా లేకపోవటంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి ఓపెన్ జిమ్‌లో ఏర్పాటు చేసిన పరికరాలను ఉపయోగంలోకి తీసుకువచ్చి జిమ్ చేసే వారిని ప్రోత్సహించాలని కోరుకుంటున్నారు.
- జిమ్ ఏర్పాటు చేసిన పార్కు ఆవరణ అంతా చెత్తాచెదారంతో నిండి ఉంది. సుందరీకరణ చేపట్టడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్‌కు వచ్చే వాకర్స్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పార్కు సమీపంలో మొబైల్ మరుగుదొడ్డి సైతం అపరిశుభ్రంగా తయారైంది.
- పార్కు ఆవరణలో మద్యం సేవించి ఎక్కడ పడితే అక్కడ మద్యం సీసాలు, చెత్తాచెదారం పడేస్తున్నారు. వాచ్‌మెన్ లేకపోవడం, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయకపోవటంతో పర్యవేక్షణ లోపం కారణంగా పార్కు ఆవరణ అపరిశుభ్రంగా తయారైంది. ఇప్పటికైనా వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేసి పార్కు ఆవరణ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



గాయత్రీనగర్‌లోని జీహెచ్‌ఎంసీ పార్కులో పాడైపోయిన జిమ్ పరికరాలు

నిర్వహణ లోపంతో అపరిశుభ్రంగా మారిన గాయత్రీనగర్ పార్కు, మొబైల్ టాయిలెట్



ట్రైనర్‌ను నియమించాలి

గత ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిరుపేదల కోసం ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసింది. ప్రస్తుతం సామాన్లు విరిగిపోయాయి. ఇంత వరకు రిపేర్ చేయలేదు. అవి అలాగే ఉంటున్నాయి. రిపేర్ చేయిస్తే బాగుంటుంది. అదేవిధంగా ఒక ట్రైనర్‌ను నియమించాలి.

– లింగాల ఐలయ్య, లక్ష్మీనగర్

పేదల ఆపన్న హస్తం.. సీఎంఆర్‌ఎఫ్ పథకం



ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేస్తున్న బండి రమేష్, కాంగ్రెస్ నాయకులు

బాలానగర్: మూసాపేట డివిజన్ భరత్‌నగర్ కాలనీకి చెందిన ఎస్. కవిత కొంత కాలంగా బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతోంది. చికిత్సకు డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్న వారు ఈ విషయాన్ని మూసాపేట కంటెస్టెడ్ కార్పొరేటర్ గోపిశెట్టి రాఘవేందర్ దృష్టికి తీసుకొచ్చారు. ఆయన వెంటనే కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన బండి రమేష్ వారితో సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేయించి నిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. ఈ మేరకు మంజూరైన రూ.3లక్షల ఎల్‌ఓసీ పత్రాన్ని గురువారం ఆయన కవిత కుటుంబసభ్యులకు అందజేశారు. బాలానగర్‌లోని కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు దినేష్‌కుమార్, రమేష్, చున్నూపాషా, మహమ్మద్ మోసిన్, షేక్‌సలాఉద్దీన్, తూము సంతోష్‌కుమార్, నల్లోల రాజేందర్, అస్లాం తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత పాటించాలి

పటాన్‌చెరు టౌన్: డ్రైనేజీ పనుల్లో నాణ్యత పాటించడంతో బాటు సకాలంలో పూర్తి చేయాలని కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ అన్నారు.గురువారం పటాన్‌చెరు డివిజన్ పరిధి బండ్లగూడలో నూతనంగా నిర్మిస్తున్న అంతర్గత డ్రైనేజీ పనులను హెచ్‌ఎండబ్ల్యూఎస్ ఏఈ ప్రవీణ్‌తో కలిసి సందర్భంగా కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు.

అవగాహన సదస్సు

పటాన్‌చెరు టౌన్: బాలికలకు, మహిళలకు భద్రత కల్పించడమే లక్ష్యమని ఎస్ఐ ఆసిఫ్ అలీ అన్నారు.గురువారం పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా మహిళా సాధికారిత కేంద్రం ఆధ్వర్యంలో బాలికలను రక్షిద్దాం... బాలికలను చదవిద్దాం అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు బాలికలు సమస్యలు అధిగమించి చదువుకోవాలని సూచించారు. బాలికలకు వేధింపులు ఉంటే వెంటనే పోలీసులను సంప్రదించాలన్నారు.

ఇంటి పన్ను తగ్గించాలని వినతి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఇంటి పన్నులు తగ్గించాలని కోరుతూ తెల్లాపూర్ అసోసియేషన్ అధ్యక్షులు ఈశ్వరగారి రమణ ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిహెచ్ఎంసి పరిధిలో కన్నా తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఇంటి పన్ను ఎక్కువగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు స్పందించి సమస్య పరిష్కరించాలని ఆయన కోరారు. అదేవిధంగా తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పలు గేటెడ్ కమ్యూనిటీల సమస్యలను మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు.

ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించండి



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన ఐఎన్‌టీయూసీ నాయకులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్ విశ్రాంత ఉద్యోగుల ఇళ్ల స్థలాల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని గురువారం అసెంబ్లీ ఆవరణలో కలిసి ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. భాస్కర్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 30 సంవత్సరాల క్రితం ఆల్విన్ కంపెనీ కార్మికులకు ఆనాటి ప్రభుత్వం కొంత మేర నగదు కట్టించుకొని భూమిని అందజేసిందన్నారు. రెవెన్యూ పరంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. అదే విధంగా రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షులు డా. సంజీవరెడ్డితో సమస్యను వివరించారు. కూకట్‌పల్లి ఆల్విన్‌కాలనీ ఉద్యోగుల ఇళ్ల సమస్య పరిష్కారానికి చొరవ చూపడానికి కృషి చేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు ఆర్.డి. చంద్రశేఖర్, ఎరగాని నాగన్న గౌడ్, తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో నల్లాలు చోరీ

పీఎస్‌లో హెచ్‌ఎం ఫిర్యాదు

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వ పాఠశాలలోని వాష్ రూమ్‌ల నుండి 40 ట్యాప్స్ ఎత్తుకెళ్లారని హెచ్‌ఎం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం జ్యోతి తెలిపిన ప్రకారం..పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోని బాత్‌రూమ్‌లలోని ట్యాప్‌లను బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని చెప్పారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



హెచ్‌ఏఎల్ పార్కు వెనుక భాగంలో ఫుట్‌పాత్‌లపై చెట్ల కొమ్మలు

చెట్ల కొమ్మలు.. ప్రజలకు తిప్పలు

- విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు
- పది రోజులుగా అక్కడే
- అధ్వానంగా మారిన కాలనీ ఫుట్‌పాత్‌లు
- పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు

ఓల్డ్ బోయిన్‌పల్లి: హెచ్‌ఏఎల్ కాలనీలో విద్యుత్ వైర్లకు చెట్ల కొమ్మలు అడ్డుగా వస్తున్నాయని బోయిన్‌పల్లి విద్యుత్ అధికారులు చెట్ల కొమ్మలను తొలగించారు. పది రోజులుగా ఆ చెట్ల కొమ్మలు అక్కడే ఉండటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆకులు ఎండిపోయి కాలనీ పరిసరాలు దుర్గంధంగా మారాయి. ఈ విషయంపై స్థానికులు విద్యుత్ ఏఈ, ఏడీఈకి ఫోన్లు చేస్తే పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. కనీసం సమాధానం ఇవ్వకుండా ఫోన్ పెట్టేస్తున్నారని కాలనీ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా హెచ్‌ఏఎల్ పార్కు వెనుక భాగంలో కుప్పలుగా వేసిన చెట్ల కొమ్మలతో రాకపోకలకు ఇబ్బందిగా మారిందని చెబుతున్నారు. కొత్తగా వచ్చిన ఏఈ తమ సమస్యలను పట్టించుకోకుండా ఇష్టానుసారంగా వ్యవహిస్తున్నారని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా స్పందించి చెట్ల కొమ్మలను అక్కడి నుంచి తొలగించాలని కోరుతున్నారు.





కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాస్‌రావుకు శుభాకాంక్షలు



కూకట్‌పల్లి ఏసీపీగా శ్రీనివాసరావు ఇటీవల బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గంలోని వివిధ పార్టీల నాయకులు, కాలనీల ప్రతినిధులు గురువారం ఏసీపీని మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

– మూసాపేట

కేన్సర్ ఇమ్యునోథెరపీపై సెమినార్



రాయదుర్గం: ఇమ్యునోథెరపీ అపోహలను తొలగించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని ప్రముఖ కేన్సర్ పరిశోధకులు డాక్టర్ కీత్‌ఫ్లాహెర్టీ పేర్కొన్నారు. నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని కాంటినెంటల్ ఆస్పత్రిలో కేన్సర్ అవేర్‌నెస్ నెలలో భాగంగా ఇమ్యునో ఆంకాలజీలో అడ్వాన్సెస్‌పై ఇంటరాక్టివ్ సెషన్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యవక్తగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కేన్సర్ చికిత్సలో అనేక మార్పులు వచ్చాయని, శాస్త్రవేత్తలు చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. జన్యు ఆధారిత చికిత్సల అభివృద్ధి, చికిత్స నిరోధకతను పరిష్కరించడానికి వ్యూహాలు, వ్యక్తిగతీకరించిన చికిత్సను అభివృద్ధి చేయడంలో కీలకపాత్ర పోషించాయన్నారు. పరిశోధకులు డాక్టర్ రమీ ఇబ్రహీమ్ మాట్లాడుతూ ఊపిరితిత్తుల కేన్సర్, మూత్రాశయ, మెదడు, బ్రెస్ట్ కేన్సర్ల చికిత్సా పురోగతిని వివరించారు. కాంటినెంటల్ ఆస్పత్రి సీనియర్ మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ ఏవీఎస్ సురేష్ మాట్లాడుతూ వ్యక్తిగత ఇమ్యునోథెరపీ, టార్గెట్ ఇమ్యునోథెరపీపై పలు అధ్యయనాలను వివరించారు. ఇన్ఫర్మేటివ్ సెషన్ కార్యక్రమంలో కాంటినెంటల్ ఆస్పత్రి కేన్సర్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ జగన్నాథ్, చైర్మన్ డాక్టర్ గురు ఎన్ రెడ్డి, మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ ఏవీఎస్ సురేష్, ఇతర డాక్టర్లు, పరిశోధకులు పాల్గొన్నారు.

ఘనంగా సంత్ సేవాలాల్ జయంతి



సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల్లో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ బాబూరావు



మోతీనగర్: బంజారాజాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటేలా కృషి చేసిన మహోన్నత వ్యక్తి సంత్ సేవాలాల్ మహారాజ్ అని కూకట్‌పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. గురువారం అల్లాపూర్ డివిజన్ పర్వత్‌నగర్ మినీ ఫంక్షన్‌హాల్‌లో తుల్జాభవాని సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సబిహా బేగం, ఆర్. బద్రునాయక్, ఆర్. కళ్యాణనాయక్, ఆర్. గోపాల్ నాయక్, భాస్కర్‌నాయక్, ఆర్. రమేష్ నాయక్, పర్వత్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మహమ్మద్ జాహిద్ షరీఫ్ బాబా తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్‌నగర్‌లో..

మూసాపేట: సంత్ సేవాలాల్ మహారాజ్‌ని గురువారం బాలాజీనగర్ డివిజన్ సేవాలాల్ నగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో మాజీ కార్పొరేటర్ పగుడాల బాబూరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ.. సమాజ శ్రేయస్సుకు సంత్‌సేవాలాల్ మహారాజ్ కృషి అజరామరమని అన్నారు. బంజారాల సమానత్వ సాధనకై ఆయన ఎంచుకున్న మార్గం ఆదర్శనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు హరినాథ్, శంకర్‌నాయక్, కైలా, హైమావతి, భీమ్‌రావు, స్వామిగౌడ్, వెంకట్‌రావు, సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్

ఆల్విన్‌కాలనీ: సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా ఆల్విన్‌కాలనీ డివిజన్ పీజేఆర్‌నగర్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, కాలనీ నాయకులు యాదగిరి ఆహ్వానం మేరకు బీజేవైఎం నేషనల్ ఆఫీస్ కోఆర్డినేటర్ కుమార్ యాదవ్ హాజరై సంత్ సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం మాట్లాడుతూ.. సంత్ సేవాలాల్ మహారాజ్ ఒక గొప్ప సంఘ సంస్కర్త అన్నారు. లంబాడీల ఐక్యత కోసం నిరంతరం పాటుపడిన వ్యక్తి అని కొనియాడారు. బంజారాల ఆరాధ్యదైవం, అహింసా మార్గాన్ని ఎంచుకొని బంజారా జాతిని సన్మార్గంలో నడిపించిన మహానుభావుడు అన్నారు. మతమార్పిడులను అరికట్టి క్షేత్ర ధర్మాన్ని కాపాడిన ధర్మయోగి సంత్ సేవాలాల్ మహారాజు అని అన్నారు. బంజారా జాతికి సేవాలాల్ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.



వేడుకల్లో బీజేవైఎం నేషనల్ ఆఫీస్ కోఆర్డినేటర్ కుమార్‌యాదవ్, బంజారా నాయకులు



సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల్లో కాంగ్రెస్ నాయకుడు రమేష్ నాయక్ తదితరులు

భారత్ బంద్‌ను జయప్రదం చేయాలి

బాలానగర్: కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో 16వ తేదీన జరిగే భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని సీపీఐ నాయకులు గురువారం పిలుపునిచ్చారు. బాలనగర్ శ్రీశ్రీ నగర్‌లోని పీపీఐ కార్యాలయంలో కూకట్‌పల్లి మండల కార్యదర్శి జి. కృష్ణ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మోదీ కార్మిక, రైతు వ్యతిరేక ప్రభుత్వాన్ని గద్దె దింపే వరకు పోరాటం చేయాలన్నారు. ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక చట్టాలను తొలగించి వారికి అనుకూల చట్టాలను తేవడానికి ఈ భారత్ బంద్‌కు పిలుపునిచ్చామన్నారు. ఈ బంద్‌లో కార్మికులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు మనోహర్‌చారి, దావూద్, రాములు, చంద్రమ్మ, ఉమారాణి, మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్వీ మేడ్చల్ కోఆర్డినేటర్ పదవికి శ్రీకాంత్ రాజీనామా



రాజీనామ పత్రాలతో శ్రీకాంత్, ఇతర నాయకులు

కూకట్‌పల్లి: బీఆర్‌ఎస్వీ విద్యార్థి విభాగం మేడ్చల్ కోఆర్డినేటర్ ఎం. శ్రీకాంత్ తన పదవికి, ప్రాథమిక సభ్యత్వానికి గురువారం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు దశాబ్దాలుగా బీఆర్‌ఎస్వీని కూకట్‌పల్లిలో స్థాపించి శేరిలింగంపల్లి నియోజకవర్గానికి అధ్యక్షుడిగా పనిచేశానన్నారు. ఉద్యమ సమయం నుంచి పార్టీ కోసం శక్తికి మించి కష్టపడ్డానన్నారు. కొన్నేళ్లుగా పార్టీలో పరిస్థితులు తమను తీవ్రంగా బాధించాయని పేర్కొన్నారు. ఉద్యమకారులకు పార్టీలో సముచిత స్థానం లేదన్నారు. విద్యార్థి విభాగం నాయకులను కేవలం జెండాలు మోసే కార్యకర్తలుగా భావిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

మర్యాదపూర్వక కలయిక



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని కలిసిన సూర్యప్రకాష్‌రావు, సూర్యరావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి బీజేపీ సీనియర్ నాయకులు నాయినేని సూర్యప్రకాష్‌రావు, అర్పనపల్లి సూర్యరావు గురువారం కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ శాసనసభ బీజేపీ ఫ్లోర్ లీడర్‌గా నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డిని నియమించిన సందర్భంగా ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సిర్పూర్ నుంచి నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబును కలిసి అభినందించారు.

బండి సంజయ్ గెలుపుకోసం ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న బండి సంజయ్, బీజేపీ నాయకులు శ్రీనివాస్‌యాదవ్ తదితరులు

మోతీనగర్: రానున్న ఎంపీ ఎన్నికల్లో బండి సంజయ్ రెండోసారి భారీ మెజార్టీతో గెలిచి సెంట్రల్‌లో మంత్రి పదవి పొందాలని మేడ్చల్ అర్బన్ జిల్లా సెక్రటరీ పులిగొళ్ల శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. గురువారం బండి సంజయ్ శ్రీదుర్గామల్లేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజా సంగ్రామ యాత్రలో భాగంగా బండి సంజయ్ కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో సిరిసిల్ల జిల్లాలో తలపెట్టిన పాదయాత్రలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ మెంబర్ సుదర్శన్ ముదిరాజ్, సీనియర్ నాయకులు నార్లపురం శ్రీనివాస్‌లు పాల్గొని సంఘీభావం తెలిపారు.

వైభవంగా దుర్గామల్లేశ్వరి ఆలయ వార్షికోత్సవం



దుర్గామల్లేశ్వరి మాతను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పర్వత్‌నగర్ చౌరస్తాలోని దుర్గామల్లేశ్వరిదేవి ఆలయ వార్షికోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి పంచామృతాభిషేకం, నూతన వస్త్రాలంకరణ, సామూహిక కుంకుమార్చనతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్, బీజేపీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్ రెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారికి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో మహమ్మద్ జాహెద్ షరీఫ్ బాబా, సుంకన్న, రాజారావు, శ్రీనివాస్‌యాదవ్, కొండన్న, పులిగొళ్ల శ్రీనివాస్, రాజు, శ్రీనివాస్, కృష్ణ, రాజు, బ్రహ్మ తదితరులు పాల్గొన్నారు.

కొండాపూర్ బెటాలియన్‌లో క్వార్టర్స్ నిర్మాణానికి శంకుస్థాపన

గచ్చిబౌలి: కొండాపూర్‌లోని టీఎస్ఎస్‌పీ 8వ బెటాలియన్‌లో అధికారులు, సిబ్బంది కోసం క్వార్టర్స్ నిర్మాణానికి టీఎస్ఎస్‌పీ అడిషనల్ డీజీపీ స్వాతి లక్రా శంకుస్థాపన చేశారు. గురువారం తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండి ఎం.రమేష్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. రూ.13 కోట్ల వ్యయంతో అధికారులు, సిబ్బంది కోసం 19 క్వార్టర్స్ నిర్మించనున్నారు. కార్యక్రమంలో టీఎస్ఎస్‌పీ డీఐజీ ఎం.ఎస్.సిద్దిఖీ, చీఫ్ ఇంజనీర్ కె.సుబ్రహ్మణ్యం, తులసీధర్, ఈఈ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.